గురజాడ వీధి

కథానిక

# నగరంలో నారి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

**భాగ్య నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అసంఖ్యాక ఆకాశహర్మ్యాల్లో, వో సింగిల్ బెడ్ రూం ఫ్లాట్‌లో సామాను సర్దుకోలేక సతమతమౌతూ, తనను తాను తిట్టుకుంటూ మధ్య మధ్యలో, మౌనంగా, మనసులోనే–కట్టుకున్న మొగుడి మీద విసగట పడుతోంది సావిత్రి**

మంచం వేస్తే టేబిలు పట్టదు, అది ముందు హాలు.

బియ్యం డబ్బా, పోవుల పెట్టెలూ, పప్పల సీసాలూ, సరిగా సర్దుకుందామంటే, అటు గూడూ లేదు, ఇటు అటకాలేదు. అన్నీ నట్టింటే! – అది వంటగది. ఇహ కాలకృత్యాలకు అదే గది, చన్నీటి స్నానాలకూ అదేగది, బట్టలు పిండుకోడానికీ అదేగది. – "బాత్‌రూంట, బాత్ రూం" పళ్ళు కొరుక్కుంది సావిత్రి. వెన్నెట్లో గర్వంగా తలొంచే వంట పొలంలా వున్న తన బతుకు, ఈ నగరంలోకి వచ్చింతర్వాత, నీళ్ళు చాలక గిడసబారిన అరటివువ్వులా అయిపోయింది.

ఇదిగో, అదిగో అంటూ అయిదేళ్ళుగా ఆశ పెట్టి, ఇప్పటికిచ్చింది గవర్నమెంటు తన మొగుడికి పోస్టింగ్, చార్మినార్ వెనకాల షాలిబండ దగ్గరలో ఎలిమెంటరీ స్కూల్లో, బతకడానికో బడిపంతులుద్యోగం! పరధ్యానంగా ముందుకడుగేసిన సావిత్రికి మంచంకోడు తగిలింది. 'అబ్బా' అనుకుంటూ తలపైకెత్తింది. వారగా వున్న ఓ పెట్టెమీద, మాసిన తుండుగుడ్డమీద, మెరుస్తున్న ఫ్రేములో, పాదం చూపిస్తూ అభయ ముద్రలో వున్న వెంకటేశ్వర స్వామి భార్యాసమేతుడై కనిపించాడు. ఆయన మీద వేసిన వూలదండ వాడిపోయింది. వెలిగి ఆరిన అగరబత్తీలు, కొడిగట్టిన దీపం, తప్ప క్షమించమన్నట్టుగా చెంపలు వేసుకుంది సావిత్రి. "స్వామీ! నాది నిర్లక్ష్యం కాదు, నన్ను క్షమించు. ఎడారితనం పర్చుకున్న చోట ఏంచేస్తే పన్నీటి చెట్లు పెరుగుతాయో నాకు అర్థం కావడంలేదు. ఈ నగరంలో బతకలేమోనన్న భయంగా వుంది. ఎంతగా ఆశల్ని మేం చంపుకున్నా, అవసరాలు





మమ్మల్ని చంపడం మానలేదు. అవసరాల కోసం ఘర్షణలు తప్పడంలేదు. ఏం చేయడం స్వామీ, ఎట్లా బతకడం?"

సావిత్రి బేలగా భగవంతుడి వేపు చూసింది ఆ కళ్ళల్లో నీళ్లు.

ఇంతలో గుమ్మం దగ్గర అడుగుల చప్పుడు విన వడింది. అప్పుడే ఆయన వచ్చేశారా? ఆయనకేం, మగమహారాజు, అట్లా వెళ్తారు, ఇట్లా వస్తారు, బతుకంతా మగవాడికి ఓ ఆటే, ఆడదానికే 'వేట'!

వెనక్కి తిరిగిచూసింది సావిత్రి, గుమ్మం దగ్గర ఓ మెరుపుతీగ. బాబ్డ్‌హెయిర్ బ్యూటీ క్లినిక్‌లో కాస్టీగా ఫేసియల్ చేయించుకున్నట్టుగా వున్న మెత్తని మొహం....ట్రిమ్డ్ ఐ బ్రోస్.....

నవ్వింది ఆమెరుపుతీగ, పెదిమల మీద వున్న ఎరుపు, గులాబీలా విచ్చుకుంది. ఉషోదయ సమయంలో కన్ను విప్పినట్లు. అబ్బ! ఎంత అందంగా వుంది ఆ మెడ!" ఆ యౌవనం ఏమిటి తనవే ఆశ్చర్యపరుస్తోంది". చీర చెంగు వెనకాల ముడతలు పడని సన్నని నడుము. కాళ్ళకు అవే మిటి, చెప్పలేనా, చెప్పల్లో ఆమె పాదాలు చెప్పలకే అందం తెచ్చాయి. ఆ మెరుపుతీగ ఏమీ పట్టనట్లు పలికింది. "లోపలికి రావచ్చునా?"

"రండి....రండి....! కంగారుగా అన్నది సావిత్రి

ఆమె, తను వేసుకున్న చెప్పల్ని బయట గుమ్మం దగ్గర వదిలిపెట్టబోయింది.

సావిత్రి వారించింది, "పర్వాలేదు, లోపలికి రండి, మావారికి వసంతవాడ నుంచి వచ్చింత ర్వాత, చెప్పలతోనే వంటింట్లోటి రావడం అలవాటైంది లెండి!"

ఆమె సావిత్రివైపు మెచ్చుకుంటున్నట్లుగా, విచ్చుకున్న కళ్ళతో చూసింది. "అట్లాగా!" అన్నది మధుర మధురంగా. ఇంకా మీరు పాతకాలపు మనుషులేమో అనుకున్నాను. కాదన్నమాట. ఆమె ఇల్లంతా ఓసారి తన విశాల నేత్రాలతో పరికించింది.

"చాలా బావుంది సుమాండి మీ ఇల్లు" చక్కగా ఫ్యాన్సీ బొమ్మల్లా వున్నాయి, ఎక్కడి వస్తువులు అక్కడ, బాగా సర్దుకున్నారు. అచ్ఛాహై. "బహూత్ అచ్ఛాహై"

ఆమె ఎందుకో ఓసారి నిశ్వసించింది. "అవునెండి, ఏమైనా ఇది ఇద్దరికోసమేగా! డిస్టర్బ్ చేసేవాళ్ళెవరున్నారు?"

సావిత్రి ఆమాటకు కాదన్నట్లు నవ్వింది. "ఉహు....ముగ్గురి కోసం!! డిస్టర్బెన్స్ ఏం వుండదు. ఇష్టం వుంటే అంతేగా!"

ఆమె లోపలికి వచ్చింది. వస్తుంటే గుప్పున పరిమళం వచ్చింది. వేడిగాలి ఉద్రేకం చెంది నాట్యం చేసింది.

"ఓహ్! అలాగా! ఒకటే ప్లస్ ఒకటి ఈజ్ ఈక్వల్‌టు 'త్రీ' అన్నమాట. ప్యారీ బెహన్...ఎక్కడుంది పాప? చూపించవ్?"

ఆ కంఠంలో విషాదపు సన్నటి జీర

"అదిగో – ఆ ఉయ్యాల్లో నిద్రపోతోంది!" చూపించింది సావిత్రి

ఆమె ఉయ్యాల దగ్గరకు నడిచింది. ఉయ్యాలలో వున్న పసిబిడ్డను తేరిపార చూసింది. "హరి పిడుగు – నిద్రలోనే నవ్వుకుంటోంది, ఎవరి పోలిక? – తండ్రిదేనా?"

"అనుకొంటున్నా.....అన్నట్టు అక్కగారూ, మీరెంతమందీ?"

ఆమె ఆమాటకు విరగబడి నవ్వింది, "ఏవిటేమిటీ?....అక్కయ్యనా నేను?...ఏదీ మళ్ళీ అలా పిలు....అంత ముసలిదాన్లా కనబడుతున్నానా...? ఏమిటే... ఒకటి రెండేళ్ళు నేనే పెద్దేమో నీకన్నా, సరే – నీ కోరిక ఎందుకు కాదనాలి? ఇహనుంచీ అక్కయ్యా, రోషనారా అని నువ్వు నన్ను పిలవాలి. సరేనా.... మరి నీ పేరు?"

"సావిత్రి.....!"

రోషనారా కళ్ళెగరేసింది. "సావిత్రా? ఆపేరుతో ఏదదో నాటకం వుండొద్దూ – సతీ సావిత్రేనా? ఎప్పుడో చిన్నప్పుడు చూశాన్లే!! ఆ నాటకంలో ఓ సావిత్రి యముడితో దెబ్బలాడ్తుంది కదూ – తన మొగుడి ప్రాణం కోసం? "

సావిత్రి లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి ఇస్తూ అడిగింది, " ఎంతమంది అక్కగారూ మీరు? ముగ్గురా–నలుగురా?"

రోషనారా పెదవులు దగ్గరై విడివడ్డాయి. కళ్ళు ఆర్ద్రమై విశాలమైనాయి.

"ఒక్కదాన్నే సావిత్రీ! ఇంకా ఒక్కదాన్నే! వెనకా ముందు ఎవ్వరూలేరు. ఆ బాధలూ, బాధ్యతలూ, కట్టుకున్నవాడిచేత దెబ్బలు తినడాలు అవేమీ లేవు. ఇహ పెళ్ళే కానప్పుడు......"

ఆమె అర్థాంతరంగా ఆగింది. ఉయ్యాల్లో వున్న పిల్లవేపు చూసింది.

ఎక్కడో అస్పష్టంగా వున్న ఆశల దూరతీరాలవేపు చూస్తున్న చూపు

సావిత్రికి ఆమె ఒక అర్థంకాని ప్రశ్నలా కనిపించింది.

"ఇంకా పెళ్ళే కాలేదా?" ఎందుకని....?

"నసీబ్...బెహన్....నసీబ్....ఆ అల్లా అంతే ఇచ్చాడు ఆ..!ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ముసలమ్మ మూలుగు వినొచ్చే టైమయింది. ఒకే అపార్ట్‌మెంట్స్‌లో వుంటున్నాం కదా! మరోసారి తీరిగ్గా మళ్ళీ కలుసుకుందాం....ఏం?"

రోషనారా ముందుకడుగేసి, ఊయల దగ్గరకు వచ్చి వెన్నెల బొమ్మలా వున్న పసిబిడ్డ పాల చెక్కిళ్ళను ముద్దు పెట్టుకొని, వెనక్కు తిరిగి, మౌనంగా వెళ్ళి ద్వారం దాకా వాళ్ళింది.

సావిత్రికి ఆమె మాటలు వింటున్న కొద్దీ ఆయోమయం ఎక్కువ కాసాగింది.

"ముసలమ్మా? ముసలమ్మా ఎవరన్నా వున్నారా మీ ఇంట్లో?"

రోషనారా పెదవులు అందంగా విచ్చుకున్నాయి., నీరెండలో పల్లెటూరి చెరువులో తొలి తామరాకులా విచ్చుకున్నట్లు....

"ఓ నా చిట్టి చెల్లెలా!...ముసలమ్మంటే మా అంబాసిడర్ కారు అది వచ్చే వేళైంది."

సావిత్రి కళ్ళు ఆల్చిప్పల్లా విచ్చుకున్నాయి. మొహంలో, ఆశను అంటించుకున్న చెంపలు 'ఎంతదృష్టమో! నువ్వు కార్లోనే తన్న కాలు కిందపెట్టనుకుంటాను. ఎంతపుణ్యం చేసుకున్నావో!"

కాలు బయట పెట్టబోయిన రోషనారా కాలు మళ్ళీ వెనక్కు తీసుకొని....

"పుణ్యమా? అనుకున్న ఎంత పుణ్యమో! మరి మన్న?...." అని అడిగింది

ఆ ప్రశ్నతో సావిత్రికి గతం గుర్తుకు వచ్చింది.

"నేనా? నేను" నేను....నాలుగువేళ్ళు నోట్లోకి వెళ్ళడమే గగనంగా బతుకీడ్చే నో దిగువ మధ్య తరగతి కుటుంబంలో నుంచి, కూటికోసం బతుకే ఓ పీడకలలా భావించే మరో కుటుంబంలోకి పసుపుకొమ్ము మెడలో కట్టించుకుని, భయం భయంగా అడుగెట్టాను. మాలాంటి వాళ్ళ ఇళ్ళల్లో నోటికీ చేతికీ సంబంధం కుదరటమే కష్టం అక్కగారు! అంతంత మాత్రం బతుకులు.మండే చితుకులు. మీరు చెబితే నమ్మరు. నాజీవితంలో నేను రెండేరెండు సార్లు కార్లో ఎక్కాను. ఒకటి మా వివాహంలో వూరేగింపు సమయంలో, రెండోది మావాడు కడుపునవుండగా పురుటికి పెద్దసుపత్రికి పోయినప్పుడూనూ!.

"ప్చ్!ప్చ్!" రోషనారా సానుభూతిగా అన్నది.

తర్వాత "మళ్ళీ వస్తాను" అంటూ వెళ్ళిపోయింది. కన్నీటి కథ మొదలైతే ఎక్కడ ఆగుతుందో తెలీదు. ఏ ఆకలి మలుపు తిరుగుతుందో తెలీదు. రోషనారాకు ఆ కథలు వినడం ఇష్టం లేదు. అనుక్షణం రంగులు మారే ఈ ప్రపంచంలో, రహస్యాల్ని కడుపులో దాచుకొని, కళ్ళల్లో రాగాన్నీ, హాస్యాన్ని ప్రతిఫలించాల్సిన ఈ బతుకుల్లో "హల్లో డియర్, హౌడూయూడూ?" అంటూ మగవాణ్ణి ఫైవ్ స్టార్ హోటల్లో ఖుతిపోగొట్టవలసిన పరుగుపందెం జీవితాల్లో, కన్నీటికీ, కన్నీటి కథలకూ తావెక్కడ?

వచ్చేవారం

గురజాడ వీధి

శీర్షికలో

సి. హెచ్. మధు

గోదావరి

కథ

రోషనారా వెళ్ళిపోయినా, ఆమె తలపులు మాత్రం సావిత్రి మనసులో నుంచి వెళ్ళలేదు. చార్లో పోపు పెడుతున్నా, బట్టలకు సోపు పట్టిస్తున్నా, పిల్లకు పాలు పడుతున్నా, సావిత్రి మనసులో రోషనారా సింహాసనం వేసుకొని ఠీవిగా కూర్చునే వుంది. దాంతో ఒకటి రెండు రోజులు తన స్నేహితురాలి రాకపోకల్ని, కిటికీగుండా గమనించింది. సావిత్రి గమనించి, ఆశ్చర్యంలో తెల్లబోయింది. అడక్కుండా ఉండలేకపోయింది.

దశమి చంద్రుడు మబ్బు పరదాన్ని తొలగించుకొని నక్షత్ర కన్యలతో నయ్యాటకు సిద్ధమయ్యే వేళ–

అపార్ట్‌మెంట్స్‌లో పైన బాల్కానీలో పిట్టగోడ నానుకుని వాళ్ళిద్దరూ నుంచున్నారు. రోడ్డుమీద ప్రవహిస్తున్న జనచిత్ర ప్రవాహాన్ని గ్రహిస్తున్నారు. సావిత్రీ బిడియంగా అడిగింది, "అన్నట్టు, ఎవరక్కయ్యా–ప్రతిరోజూ నిన్ను తీసుకుపోవటానికి, కోటు, ప్యాంటు, బూట్లు వేసుకొని, కార్లో వస్తున్నడే అతను?".

రోషనారా ఉలిక్కిపడింది. అయితే ఆ ఉలికిపాటు, వెలితెలి నీడల్లో సావిత్రికి కనబడలేదు.

"అచ్చా! అయితే నువ్వతన్ని చూశావన్నమాట! అతను, అ..త..నూ..." ఆగింది మాటలకు వెతుక్కుంటున్నట్లుగా "అదే, మా మేనత్త కొడుకుగాను కొంచెం హార్ట్ వీక్‌నెస్ ఉంది కదా, అందుకని సాయంకాలపూట అట్లే ఏ బిర్లా టెంపుల్‌కో సంజీవయ్య పార్క్‌కో, గండిపేట చెరువు దగ్గరకో నన్ను రిలీఫ్ కోసం తీసుకువెళ్తుంటాడు".

కింద పార్కింగ్ ప్లేస్‌లోకి నో మారుతీకారు వచ్చి ఆగడం కనిపించింది. ఆకారు హెడ్‌లైట్లు మూడుసార్లు వెలిగి ఆరిపోయాయి.

— మళ్ళీ వచ్చేవారం


రిమెంబర్

బ్రాహ్మితో కూడినది

గుర్తుంచుకోండి,
స్కూల్‌లో మంచి ర్యాంకులు
పొందేందుకు

రిమెంబర్ ఒక జ్ఞాపక శక్తి టానిక్. ఇందులో బ్రాహ్మి, శంఖపుష్పి అనే ఆయుర్వేద మందుల రహస్యం దాగుంది కనుక మళ్ళీ గుర్తుంచుకునేందుకు సాయపడుతుంది. కాబట్టి ఇక మీరు బాగా రాణించి, బాగా ర్యాంకులు సొంతం చేసుకోవచ్చు.

BIONA

18/1&3, అజామాబాద్, హైదరాబాదు-500 020
అన్ని ప్రముఖ మందుల షాపుల్లోనూ లభిస్తుంది.




Mudra : BE : 97093 Tel

మెమరీ టానిక్